కెరటం (సామాన్యుడి ఆయుధం) న్యూస్
గురువారం 30, నవంబర్ 2023 తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వ గుర్తింపు పొందిన మీడియా సంస్థ







# నేడే పోలింగ్

## మీ ఒక్క ఓటుతో ఏదైనా జరగొచ్చు.. తప్పకుండా ఓటెయ్యండి..



కెరటం న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

**మీరు వేసే ఒక్క** ఓటుతో ఏమైనా జరగొచ్చు.. ఆ ఒక్క ఓటే నేతల బలాన్ని బలహీనతగా మార్చేయొచ్చు.. బలహీనుడిని బలవంతుడిగానూ చేయొచ్చు.. వజ్రాయుధం లాంటి ఆ ఒక్క ఓటుకి అంత బలం ఉంది.. ఎంతో బలమైన రాజ్యాలు కుప్ప కూలింది కూడా ఆ ఓటుతోనే.. ఊసులోనే లేని నేతలను ఆ ఓటు ఒక్కసారిగా తెరపైకీ తీసుకురాగలదు.. బిందువు, బిందువు కలిసి సింధువైనట్లు ఒక్కో ఓటు కలిసి చరిత్రలనూ మిగతా 2లో..



# మహిళలే నిర్ణేతలు

## ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వారి ఓట్లే కీలకం

కెరటం న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

**ఖమ్మం, భద్రాద్రి జిల్లాల్లో** మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. ఈ జిల్లాల్లో అభ్యర్థుల భవితవ్యం మహిళ ఓటర్ల చేతిలోనే ఉంది. ఉమ్మడి ఖమ్మం జిల్లాలో పురుషుల కంటే మహిళా ఓటర్లే అధికంగా ఉన్నారు. దీన్ని బట్టి ఖమ్మం జిల్లాలోని ఐదు నియోజకవర్గాలు, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలోని ఐదు నియోజకవర్గాల్లో అభ్యర్థుల గెలుపోటములను మహిళామణులే నిర్ణయించనున్నట్లు స్పష్టమవుతోంది. అయితే ఖమ్మం జిల్లాలో 78 మంది, భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో 44 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లుగా నమోదై ఉన్నారు.

**ఖమ్మంలో 12,16,796 మంది ఓటర్లు..**

ఖమ్మం జిల్లాలో మొత్తం 12 లక్షల 16 వేల 796 మంది ఓటర్లు ఉండగా అందులో మహిళలు 6 లక్షల 27 వేల 553 కాగా, పురుషులు 5 లక్షల 89 వేల 165గా నమోదయ్యారు. ఖమ్మం నియోజకవర్గంలో అత్యధికంగా 3 లక్షల 22 వేల 996 మంది ఓటర్లు ఉండగా, పాలేరులో 2 లక్షల 36 వేల 287, మధిరలో 2 లక్షల 21 వేల 326 మంది, వైరాలో ఒక లక్షా 93 వేల 069 మంది, సత్తుపల్లి నియోజకవర్గంలో 2 లక్షల 43 వేల 118 మంది ఓటర్లుగా నమోదయ్యారు. కాగా ఈ జిల్లాలో 78 మంది ట్రాన్స్ జెండర్లు ఓటు హక్కును వినియోగించుకోనున్నారు.

**భద్రాద్రి జిల్లాలో 9,66,439మంది ఓటర్లు..**

భద్రాద్రి కొత్తగూడెం జిల్లాలో మిగతా 2లో..



# నేడే పోలింగ్

(మొదటి పేజీ తరువాయి..)

తిరగరాయొచ్చు.. అందుకే గెలు పునకు ప్రతి ఓటు ముఖ్యమే.. ఎన్నికల వేళ నాయ కులు మూలన ఉన్న ముసలమ్మలని మోసుకెళ్లేదీ అందుకే.. ఊళ్లలో ఉన్న ఓటర్లను వ్యయ ప్రయాస లకోర్చి పోలింగ్‌బూతులకు రప్పించుకునేదీ అందుకే.. అందుకే మనం వేసే ఓటు ఎంతో కీలకం అన్న విషయాన్ని అందరం గుర్తుంచుకోవాలి. "ఆ.. నేను ఒక్కడిని ఓటేయకపోతే ఏమవుతుందిలే.." అనుకుంటే మనం మన ప్రజాస్వామ్యానికి విలువ ఇవ్వనట్లే లెక్క. "నేను ఓటేస్తే సమాజం మారిపోతుందా..? అందరిలో నేనూ ఒకడిని" అనే భావనతో కొందరు ఉంటారు. కానీ ఈ ధోరణి సరైంది కాదని గమనించాలి.

**ఆ ఒక్క ఓటుతో సీఎం చాన్స్ పోయింది..**



ఒక్క ఓటు ఎన్నో ఫలితాలను తారుమారు చేసిన సందర్భాలు కోకొల్లలుగా ఉన్నాయి. అసెంబ్లీకి జరిగే సాధారణ ఎన్నికల దగ్గరి నుంచి గ్రామ పంచాయతీకి నిర్వహించే ఎన్నికల వరకు అన్నీ ఎంతో కీలకమైనవే. రాజస్థాన్ లో సీపీ జోషీ అనే రాజకీయ నేత 2008 ఎన్నికల్లో ఒక్క ఓటు తేడాతో ఓటమిపాలై ముఖ్యమంత్రి అయ్యే అవకాశాన్ని కోల్పోయారు. విచారించదగిన అంశం ఏమిటంటే ఆ ఎన్నికల్లో ఆయన తల్లితో పాటు సోదరి, కారు డ్రైవర్ కూడా ఓటు హక్కు వినియోగించుకోలేదు. ఆ ముగ్గురు ఓటు వేసి ఉంటే సీపీ జోషీ గెలుపొంది ముఖ్యమంత్రి పదవిని అధిరోహించేవారు. అలాగే 2004లో జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో కర్ణాటకకు చెందిన ఏఆర్ కృష్ణమూర్తి కూడా అలానే ఓటమి పాలయ్యారు. ఇలాంటి పరిణామాలతో గొప్ప పదవిని చేజిక్కించుకుంటారని ఊహించిన నేతలు పాతాళానికి పడిపోతారు. అలాగే ఊసులోనే లేని నాయకులు గొప్ప పదవుల్లో కూర్చుంటారు. అందుకే నేతల గెలుపోటములకు ప్రతి ఓటూ కీలకమే అని గుర్తుంచుకోవాలి.

# మహిళలే నిర్ణేతలు



(మొదటి పేజీ తరువాయి..)

మొత్తం 9 లక్షల 66 వేల 439 మంది ఓటర్లు ఉండగా ఇందులో మహిళలు 4 లక్షల 94 వేల 650 మంది కాగా, పురుషులు 4 లక్షల 71 వేల 745 మంది ఉన్నారు. ఈ జిల్లాలో 44 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు. పినపాక నియోజకవర్గంలో మొత్తం ఒక లక్ష 98 వేల 402 మంది, ఇల్లందులో 2 లక్షల 19 వేల 569 మంది, కొత్తగూడెంలో 2 లక్షల 43 వేల 846 మంది, అశ్వారావుపేటలో ఒక లక్ష 55 వేల 961 మంది, భద్రాచలం నియోజకవర్గంలో ఒక లక్ష 48 వేల 661 మంది ఓటర్లు ఉన్నారు.

**ఉమ్మడి జిల్లాలో 21,83,235 మంది ఓటర్లు..**

ఉమ్మడి ఖమ్మం జిల్లాలోని మొత్తం పది నియోజకవర్గాల్లో 21 లక్ష 83 వేల235 మంది ఓటర్లు ఉండగా, ఇందులో మహిళలు 11 లక్షల 22 వేల 203 మంది ఉండగా పురుషులు 10 లక్షల 60 వేల 910 మంది ఉన్నారు. అలాగే ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 122 మంది ట్రాన్స్ జెండర్లు ఓటర్లుగా నమోదయ్యారు.

**మహిళలే నిర్ణేతలు..**

ఉమ్మడి జిల్లాలో మహిళా ఓటర్లే అధికంగా ఉండటంతో జిల్లాలోని 10 నియోజకవర్గాల్లో వారే అభ్యర్థుల గెలుపోటములను నిర్ణయించే నిర్ణేతలుగా వ్యవహరించనున్నారు. కాగా అధికార యంత్రాంగం ఎన్నిక నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది. భద్రాద్రి జిల్లాలో అధిక భాగం ఏజెన్సీ ప్రాంతం ఉండటంతో పాటు, నక్సల్స్ హెచ్చరికల నేపథ్యంలో పోలీసులు కట్టుదిట్టమైన ఏర్పాట్లు చేశారు. ఈ ప్రాంతంలో ప్రత్యేక బలగాలను రంగంలోకి దించింది. భద్రతా దళాలు ఏజెన్సీని జల్లెడ పడుతున్నాయి.



# ఎన్నికల పోలింగ్ వేళ హైదరాబాద్ సహా పలు జిల్లాలకు వర్ష సూచన

కెరటం న్యూస్, ప్రత్యేక ప్రతినిధి

తెలంగాణలో రేపు, ఎల్లుండి.. రెండు రోజుల పాటు వర్షాలు కురిసే అవకాశం ఉందని వాతావరణ శాఖ వెల్లడించింది. ఆగ్నేయ బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడనం నేడు వాయుగుండంగా మారనున్నట్లు తెలిపింది. ఈ వాయుగుండం బంగాళాఖాతంలో వాయువ్య దిశగా పయనించి 48 గంటల్లో తుఫానుగా మారే అవకాశం ఉందని, దీంతో తెలంగాణవ్యాప్తంగా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురువవచ్చునని తెలిపింది. హైదరాబాద్‌లో ఉదయం నుంచి మేఘావృతమైన వాతావరణం ఉండవచ్చునని, పరిసర జిల్లాల్లో మోస్తరు వర్షాలు కురువవచ్చునని తెలిపింది. అదిలాబాద్, నిర్మల్, నిజామాబాద్, కామారెడ్డి, సంగారెడ్డి, వికారాబాద్, ఖమ్మం, నల్గొండ, భద్రాద్రి కొత్తగూడెం, వరంగల్ జిల్లాలకు తేలికపాటి వర్ష సూచన, దక్షిణ తెలంగాణలో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిసే అవకాశముందని తెలిపింది.

## సెలవు ఇవ్వకుంటే సంస్థలపై చర్యలు తప్పవు..: ఈసీ

హైదరాబాద్-కెరటం న్యూస్:

తెలంగాణ అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ సందర్భంగా రాష్ట్రంలో ప్రైవేటు సంస్థలు, ఐటీ కంపెనీలు ఉద్యోగులకు సెలవు ప్రకటించాలని రాష్ట్ర ఎన్నికల అధికారి వికాస్‌రాజ్ ఆదేశించారు. మంగళవారం ఆయన ఒక ప్రకటనలో పేర్కొంటూ సెలవు ప్రకటించకుంటే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఉద్యోగులు ఓటు హక్కును వినియోగించుకునేలా సంస్థలు బాధ్యత తీసుకోవాలని సూచించారు.గత 2018 అసెంబ్లీ, 2019 లోక్ సభ ఎన్నికల్లో కొన్ని సంస్థలు సెలవు ఇవ్వలేదని అప్పట్లో ఫిర్యాదులు వచ్చాయని గుర్తుచేశారు. ఈ అసెంబ్లీ ఎన్నికలకు అన్ని సంస్థలు సెలవు ఇచ్చాయో కార్మిక శాఖ పరిశీలించాలని ఈసీ ఆదేశాలు జారీ చేసింది. సెలవు ఇవ్వని సంస్థలపై చట్టప్రకారం చర్యలు తీసుకోవాలని పేర్కొంది.

## ఓటేసేందుకు అమెరికా నుంచి వచ్చిన తెల్దారుపల్లి యువకుడు

ఖమ్మం రూరల్, కెరటం న్యూస్



నేడు జరిగే అసెంబ్లీ ఎన్నికల్లో ఓటు హక్కును వినియోగించుకునేందుకు మండలంలోని తెల్దారుపల్లి గ్రామానికి చెందిన యల్లంపల్లి సందీప్ అనే యువకుడు అమెరికాలోని చికాగో నుంచి తెల్దారుపల్లి కి వచ్చాడు.ఈ సందర్భంగా సందీప్ మాట్లాడుతూ అమెరికాలో ఎన్నో ముఖ్యమైన పనులు ఉన్న ఐదేళ్లకోసారి వచ్చే ఎన్నికల్లో ఓటు వేసేందుకు సొంత ఊరికి ప్రత్యేకంగా వచ్చినట్లు తెలిపారు.ప్రతి ఒక్కరూ తమ ఓటు హక్కును వినియోగించుకోవాలని సందీప్ ప్రజలకు తెలిపారు.

# పోలింగ్ ప్రశాంతంగా నిర్వహించాలి

## జిల్లా ఎన్నికల అధికారి వీపీ.గౌతమ్

ఖమ్మం బ్యూరో, నవంబర్ 29, కెరటం న్యూస్

జిల్లాలో అసెంబ్లీ ఎన్నికల పోలింగ్ ను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. బుధవారం జిల్లా ఎన్నికల అధి కారి, స్థానిక సెంట్ జోసెఫ్ హైస్కూల్ లో ఏర్పాటు చేసిన ఖమ్మం నియోజకవర్గ, ఖమ్మం రూరల్ మండలం పొన్నెకల్ లోని శ్రీ చైతన్య ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసిన పాలేరు నియోజకవర్గ, వైరా సాంఘీక సంక్షేమ బాలికల రెసిడెన్షియల్ పాఠశాల, కళాశాలలో ఏర్పాటు చేసిన వైరా నియోజకవర్గ, మధిర పాలిటెక్నిక్ కళాశాలలో ఏర్పాటు చేసిన మధిర నియోజకవర్గ డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలను పోలీ స్ కమిషనర్ విష్ణు ఎస్. వారియర్ తో కలిసి పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, డిస్ట్రిబ్యూషన్ కేంద్రాలలో పోలింగ్ సిబ్బందికి పోలింగ్ సామాగ్రి పంపిణీ చేసే సమయంలో అప్రమత్తంగా ఉండాలని, ర్యాండమైజేషన్ ద్వారా పోలింగ్ కేంద్రాలకు కేటాయించిన ఈవీఎం యంత్రాలను సదరు పోలింగ్ కేంద్రాల సిబ్బందికి అప్పజెప్పాలని, రిజర్వ్ ఈవీఎం యంత్రాలు, రిజర్వుపోలింగ్ సామాగ్రి సెక్టార్ అధికారుల వద్ద భద్రంగా ఉండాలని, సెక్టార్ అధికారులు, పోలింగ్ సిబ్బంది ఎన్నికల నియమ, నిబంధనలను తూచా తప్పకుండా పాటించాలని తెలిపారు. అనంతరం పాత్రికేయులతో మాట్లాడుతూ, జిల్లాలో ఉన్న 5 అసెంబ్లీ నియోజకవర్గాల పరిధిలో మొత్తం 1456 పోలింగ్ కేంద్రాలలో 12 లక్షలకు పైగా ఓటర్లు ప్రశాంత వాతావరణంలో తమ ఓటు హక్కు వినియోగించుకునేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని అన్నారు. జిల్లాలో ఉన్న ఓటర్లందరూ తప్పనిసరిగా నవంబర్ 30న జరిగే పోలింగ్ లో పాల్గొనేందుకు పోలింగ్ కేంద్రానికి వచ్చి, వారి ఓటు హక్కును వినియోగించు కోవాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. ప్రతి పోలింగ్ కేంద్రం వద్ద ఓటర్లకు అవసరమైన త్రాగునీటి, టాయిలెట్ ఇతర వసతులు కల్పించామని అన్నారు. దివ్యాంగుల కోసం పోలింగ్ కేంద్రం వద్ద అవసరమైన ర్యాంప్, ట్రై సైకిళ్ళు ఏర్పాటు చేశామని అన్నారు. జిల్లాలోనీ పోలింగ్ కేంద్రాల వద్ద పటిష్ట భద్రత ఏర్పాటు చేశామని, సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల వద్ద అదనపు బలగాలను మోహరించామని తెలిపారు. జిల్లాలో అధిక పోలింగ్ శాతం నమోదయ్యే విధంగా విస్తృతంగా ఓటు ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలను నిర్వహించామని, జిల్లాలో అత్యధిక పోలింగ్ శాతం నమోదవుతుందని కలెక్టర్ ఆశాభావం వ్యక్తం చేశారు. ఎన్నికలలో మనం వేసే ఓటు మన భవిష్యత్తును నిర్దేశిస్తుందని, ఎటువంటి ప్రలోభాలకు గురి కాకుండా ప్రజలు ఆలోచించి, స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకోవాలని కలెక్టర్ సూచించారు.